ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

నిజాంపేట్: మహిళలకు ఉచిత రవాణా సౌకర్యంలో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని నిజాంపేట్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ ఆగం పాండుముదిరాజ్ అన్నారు. శుక్రవారం బాచుపల్లి చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆటో డ్రైవర్ల నిరసనకు సంఘీభావం తెలిపిన ఆగం పాండు వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఫ్రీ బస్సుతో ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు

సుభాష్‌నగర్: ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఫ్రీ బస్సు పథకంతో గిరాకీ తగ్గి ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతన్నారని... మరో వైపు ప్రైవేట్ కంపెనీల డ్రైవర్లు సైతం ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని సామాజిక వేత్త కొలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. ఆటో యూనియన్ డ్రైవర్లు శనివారం ఆర్‌కే ట్రాన్స్‌పోర్ట్ యజమాని చంద్రమౌళిని శుక్రవారం ఆయన కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన కంపెనీల ఉద్యోగులను తప్ప మిగతా ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తమ డ్రైవర్లను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు.

మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

సుభాష్‌నగర్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ గఫార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జీహెచ్‌ఎంసీ చైర్మన్ హర్షద్ షేక్, జిల్లా చైర్మన్ అడ్వకేట్ హుస్సేన్ మహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ గఫార్‌ను ఎన్నికున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: తాను పదవిలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని నివాసానికి పలు కాలనీల సంక్షేమ నాయకులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి శుభకార్యాలకు రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

బాలిక అదృశ్యం

జీడిమెట్ల: ఓ బాలిక తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ డివిజన్ అయోధ్యనగర్‌కు చెందిన బాలిక(14) శుక్రవారం ఉదయం ఇంట్లోనే ఉంది. కాగా తల్లిదండ్రులు బయటకు వెళ్లి సాయంత్రం వచ్చే సరికి బాలిక ఇంటిలో కనిపించలేదు. బాలిక కోసం చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలిక తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు స్థలం ఆక్రమించి ప్రహరీ నిర్మాణం

కూల్చివేసిన అధికారులు



నిజాంపేట్: రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కాంపౌండ్ వాల్ విషయమై శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. నిజాంపేట్ కార్పొరేషన్ శ్రీనివాస్‌నగర్ కాలనీ రోడ్డులోని రెడ్డి ఎవెన్యూ మూల మలుపు వద్ద బహుళ అంతస్తులు నిర్మిస్తున్న ఓ నిర్మాణదారుడు రోడ్డు స్థలాన్ని కలుపుకుని ప్రహరీ నిర్మించాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న అధికారులు సదరు గోడను శుక్రవారం కూల్చివేశారు. మరోమారు అక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుద్ధ్య కార్మికులు సమావేశానికి ఎందుకు రాలేదు?

కమిషనర్లను ప్రశ్నించిన ఛైర్మన్ వెంకటేశన్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశుద్ధ్య కార్మికులు సమావేశానికి ఎందుకు రాలేదని, వారికి సమాచార లోపం ఏమైనా ఉందా అని పురపాలక సంఘాల కమిషనర్లను సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్ ప్రశ్నించారు.శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో పారిశుద్ధ్య కార్మికుల స్థితిగతులను చర్చించేందుకు సఫాయి కర్మచారి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ,ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి శాఖల జిల్లా అధికారి వినోద్‌కుమార్, పురపాలక సంఘాల కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు,పోలీసు అధికారులు హాజరయ్యారు. సమావేశానికి పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు తక్కువ సంఖ్యలో రావటంపై జాతీయ కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామీణ సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొన లేకపోయినట్లు ఛైర్మన్‌తో పలువురు అధికారులు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న ఏఐటిసియూ రాష్ట్ర కార్యదర్శి యేసు రత్నం మాత్రం మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషన్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు అశోక్, కిషన్‌రావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణనతో సమన్యాయం

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్రంలోని అన్నివర్గాలకు సమన్యాయం జరిగేలా బీసీ కుల గణన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోవటం సముచితంగా ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ శాసన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ లను ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పుష్ప గుచ్చాలు అందజేశారు.

సూర్య నమస్కారాలు

200 మంది
108 సార్లు

రథసప్తమిని పురస్కరించుకొని 200 మంది ఒకేసారి పాల్గొని 108 సార్లు సూర్య నమస్కారాలు చేసి విజయవంతంగా చేశారు. శివోహం యోగా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం సుచిత్రాలోని టీఎస్ ఆర్ మాల్ అందుకు వేదిక అయ్యింది. అందులో కళాశాల విద్యార్థుల నుంచి మొదలుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, 70 ఏళ్ల వృద్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్య భగవానుడి విశిష్టతను, సూర్య నమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను యోగా గురువు రవీందర్‌రాజు తెలిపారు. – సుభాష్‌నగర్





నేటి యువత తెలుసుకోవాలి



నేటి యువత పాశ్చాత్య పోకడలతో ప్రతిరోజు వ్యాయామం చేయడమే మానేశారు. చిన్నచిన్న వాటికే అనారోగ్యాల బారిన పడుతూ.. ఆస్పత్రులకు లక్షలు చెల్లిస్తున్నారు. ప్రతిరోజు సూర్య నమస్కారాలు చేసినట్లయితే సంపూర్ణ ఆరోగ్యం పొందినట్లే. డాక్టర్ దగ్గరికి పోయే అవసరమే ఉండదు. ప్రతి ఒక్కరూ సూర్య నమస్కారాలు చేసి ఆరోగ్యంగా ఉండండి.

– కె.రవీందర్‌రాజు, శివోహం యోగా రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడు

అభివృద్ధిలో అగ్రగామి నిజాంపేట్

మున్సిపల్ కార్పొరేషన్‌లో 4ఏళ్లలో రూ.296 కోట్లతో అభివృద్ధి ● రెండుసార్లు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో దూసుకుపోతుంది. 2024 ,జనవరితో నాలుగు సంవత్సరాల పాలన పూర్తి చేసుకుంది. గతంలో బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్ గ్రామ పంచాయతీల విలీనంతో 23-07-2019 నుంచి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారింది. ప్రారంభ దశలో కొద్దిగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికి పూర్తిస్థాయి పాలక వర్గం ఏర్పడటంతో ఈ ప్రాంతం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచింది .4 ఏళ్ల పాలనలో రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం నుంచి స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులను సైతం అందుకోవడం విశేషం. 33 మంది కార్పొరేటర్లలో 7 మంది స్వతంత్ర కార్పొరేటర్లు, 27 మంది బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మేయర్‌గా కొలను నీలా గోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్‌గా ధన్‌రాజ్ యాదవ్, ఫ్లోర్ లీడర్‌గా ఆగం పాండు ముదిరాజ్‌లు ఎంపికయ్యారు. ఇక రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో సమస్యలు సైతం పెరుగుతున్నాయి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనాభా సుమారు మూడు లక్షలపైగానే ఉంటుంది.

కార్పొరేషన్‌లో ప్రధానంగా చేపట్టిన అభివృద్ధి పనులు

నిజాంపేట్ కార్పొరేషన్‌లో ప్రధానంగా పాలకవర్గం సుమారు రూ.2.96 కోట్ల పనులు చేశారు. అందులో ప్రధానంగా రోడ్లు, పార్కులు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు,బస్తీ దవాఖానాలు, శానిటేషన్, హరితహారం, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, పట్టణ ప్రగతి, పాఠశాలల మరమ్మతులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, చెరువుల అభివృద్ధి, కమ్యూనిటీ హాల్స్, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, 5 రూ.భోజన కేంద్రాల ఏర్పాటుతో పాటు పలు కార్యక్రమాలను ఎన్ఎంసి చేపట్టింది.

పాలకవర్గం, ప్రజల సహకారంతోనే ముందుకు..



నిజాంపేట్ మున్సిపల్ పాలకవర్గం, అధికారులతో పాటు ప్రజల సహకారంతోనే ప్రతి పనిని విజయవంతంగా చేస్తున్నాను. అభివృద్ధి పనులతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నాం. ప్రజలు సైతం సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. రాబోయే సంవత్సర కాలంలో మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాను.

– మేయర్, కొలను నీలా గోపాల్‌రెడ్డి

పాలనపై మేయర్ నీలా గోపాల్‌రెడ్డి ముద్ర

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొదటి మహిళా మేయర్‌గా ఎన్నికైన కొలను నీలా గోపాల్‌రెడ్డి ప్రజాప్రతినిధిగా ఎన్నికవ్వడం తొలిసారి అయినప్పటికి సమస్యల పరిష్కారం, అందుబాటులో ఉండటంతో ప్రజల మన్ననలు పొందారు.



రెండో డివిజన్‌లో పంచతత్వ పార్కు



స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు అందుకున్న మేయర్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు

ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు



ముందు స్వచ్ఛత.. చదువు తర్వాత!

సుభాష్‌నగర్: 'ముందు స్వచ్ఛత.. చదవు తర్వాత'ఇదేంటి ఇలా అంటున్నారని అనుకుంటున్నారు కదా. అవును నిజమే.. సూరారం కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను కదిలిస్తే ఇదే అంటారు. పాఠశాల పక్కన నిత్యం చెత్తాచెదారం ఉండటంతో దుర్వాసన నడుమ చదవలేకపోతున్నామని చెబుతున్నారు. దోమల, ఈగలతో సహవాసం చేయాల్సి వస్తోందంటున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే అధికారులు సైతం పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. అందుకే తాము పాఠశాల వద్ద చెత్త వేయవద్దని ప్లకార్డులు పట్టుకుని అభ్యర్థిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ఇక్కడ చెత్త వేసేవారు తమను దృష్టిలో పెట్టుకుని వేయకుండా ఉండాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని విన్నవించారు.



సూరారం కాలనీ జడ్పీహెచ్ పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

విద్యుత్ తీగలు.. ప్రమాదకరంగా వేలాడుతూ.!

నిజాంపేట్: విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రగతినగర్‌లోని నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం రోడ్డులో విద్యుత్ తీగలు కిందకు జారడంతో ఈ విషయమై స్థానికులు పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు స్పందించక పోవడంతో 'సాక్షి'దృష్టికి తీసుకొచ్చారు. ప్రమాదవశాత్తు తీగలు ఎవరిపైనైనా పడితే వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశముందన్నారు. వెంటనే కిందకు జారిన తీగలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఫ్లైఓవర్ పనులు వేగవంతం

- నిర్మాణ సామగ్రి అక్కడే ఉంచడంతో ట్రాఫిక్
- ఫ్లైఓవర్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలంటున్న వాహనదారులు



కొంపల్లిలో కొనసాగుతున్న ఫ్లై ఓవర్ పనులు

కుత్బుల్లాపూర్: కోట్లాది రూపాయల కేంద్ర నిధులతో చేపడుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో పురోగతి రావడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతుంది. భారీ వాహనాల్లో ఫ్లై ఓవర్ సామగ్రిని తీసుకురావడం ప్రధాన రహదారుల పక్కనే వాటిని బిగించే ఏర్పాట్లలో సిబ్బంది పనులు చేస్తుండడం మూలంగా కొంపల్లి ప్రధాన రహదారి ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది.

◆ అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నారు. ఇప్పటికే సుచిత్ర కూడలి, పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో, కొంపల్లి నుంచి ఫ్లై ఓవర్ వరకు, మేడ్చల్ కోర్టు సమీపంలో రోడ్డు మధ్యలో పిల్లర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. ప్రధానంగా కొంపల్లిలో అటు దూలపల్లి నుంచి వచ్చే వాహనాలతో పాటు మేడ్చల్ నుంచి వచ్చే వాహనాలు, జీడిమెట్ల నుంచి మేడ్చల్ వెళ్లే వాహనాల రాకపోకలు భారీగా ఉండడంతో నిత్యం ఇక్కడ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏది ఏమైనా ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

బీజేపీ పాలనలో కార్మికులకు తీవ్ర అన్యాయం

- దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న కార్మిక, రైతులు సంఘాలు
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు

రంగారెడ్డినగర్: కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేలా నల్లచట్టాలను తీసుకువచ్చిందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు చింతల నాగరాజు అన్నారు. దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో శుక్రవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో బైక్ ర్యాలీని ప్రారంభించి కుత్బుల్లాపూర్ చౌరస్తా మీదుగా జీడిమెట్ల పారిశ్రామిక వాడ, జీడిమెట్ల డిపో సమీపంలోని అంబేడ్కర్ విగ్రహ వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. పదేళ్ల బీజేపీ పాలనలో కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక లోకానికి తీరని ద్రోహం చేసిందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కార్మిక లోకం బీజేపీకి గట్టి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్, నడిమింటి నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి యాదగిరి, బాలరాజ్ గౌడ్, మురళి, భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ఆకాశాన్నంటిన ధరలు

దుండిగల్: బీజేపీ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా గండిమైసమ్మ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచినా రైతులు, కార్మికుల కోసం చేసిందేమిలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బొడిగే లింగస్వామి, సత్యం, వీరమల్లు నరసింహ, ఎల్లయ్య, సూరి, పెంటేశ్, జగన్, రాధ, హంస, విజయ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం..

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ శక్తుల మద్దతిస్తూ కార్మికులను అణగదొక్కే విధానాలను అవలంభిస్తోందని ఆల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు ఆరోపించారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో, బాచుపల్లి మెయిన్ రోడ్డు, బొల్లారం చౌరస్తాలలో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ల నాయకులు కోటేశ్వరరావు, ఏసురత్నం, చంద్రశేఖర్, రాంబాబు మాట్లాడారు. భారత్ వెలిగిపోతోందని, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి తప్పుడు ప్రచారాలతో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలు మోసగిస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామని స్పష్టం చేశారు.



ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేత చింతల నాగరాజు ఆధ్వర్యంలో ఐడీపీఎల్‌లో బైక్ ర్యాలీ



ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు



బాచుపల్లి ఇండస్ట్రీ ఏరియాలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

గృహిణి ఆత్మహత్య కేసులో భర్త, అత్తమామ రిమాండ్

జీడిమెట్ల: గృహిణి ఆత్మహత్య కేసులో ఆమె భర్త, అత్తమామలు, ఆడపడచు ఆమె భర్తను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావురావు వివరాల ప్రకారం.. గాజులరామారం హెచ్‌ఏఎల్ కాలనీకి చెందిన డేగల సంతోష్‌బాబు, సంధ్యారాణి(37) భార్యభర్తలు. వీరికి 11సంవత్సరాల క్రితం వివాహం జరగగా ఇద్దరు కుమారులు ఉన్నారు. నెల రోజులుగా సంధ్యారాణికి, అత్తింటివారితో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల తనను సమ్మక్క సారక్క జాతరకు తీసుకువెళ్లాలని సంధ్యారాణి భర్తను కోరగా తీసుకెళ్లలేదు. దీనికి తోడు 11వ తేదీన పుట్టింటికి వెళ్తానని అడిగినా పంపించలేదు. మరునాడు 12వ తేదీన ఉదయం భర్త సంతోష్‌బాబు డ్యూటీకి వెళ్లగా పిల్లలిద్దరూ స్కూలుకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సంధ్యారాణి లోపలి నుంచి ఇంటి గడియలు పెట్టుకుని ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతిచెందింది. సాయంత్రం ఇంటికి వచ్చిన పిల్లలు ఎంత పిలిచినా తల్లి తలుపులు తీయకపోవడంతో చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు తెరిచారు. అప్పటికే సంధ్యారాణి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. మృతురాలి తల్లి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంధ్యారాణి భర్త సంతోష్‌బాబు, అత్తామామలు మధుసూధన్ పుష్పమ్మ, ఆడపడచు కవిత, ఆమె భర్త సతీష్‌బాబులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.